
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కరీంనగర్ జిల్లా వార్తలు
5
శుక్రవారం 20 సెప్టెంబరు 2024





చెల్పూర్ పీహెచ్‌సీలో మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



గురుకుల విద్యార్థుల ఆకలి కేకలు

- భోజన సమయాల మార్పుతో ఇబ్బందులు
- టైం టేబుల్‌ను పునఃపరిశీలించాలని కోరుతున్న తల్లిదండ్రులు

హుజూరాబాద్ సెప్టెంబరు 19: గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భోజన సమయాలను ఇటీవల ప్రభుత్వం మార్చింది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని 12:30కు పెట్టేవారు. కొత్త టైం టేబుల్ ప్రకారం అది 1.25కు మారింది. దీంతో విద్యార్థులు ఉదయం అల్పాహారం చేసిన తర్వాత 5:30 గంటలకు పైగా ఎలాంటి భోజన పదార్థాలు తీసుకునేందుకు అవకాశం ఉండడ లేదు. దీంతో విద్యార్థులు ఆకలితో అల్లాడిపోతున్నారు. ఈ సంవత్సరం జూలై 2న జీవో ఎంఎస్ నంబర్ 16 స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ గురుకుల పాఠశాల విద్యార్థులకు కొత్త టైం టేబుల్‌ను ప్రకటించింది.



కొత్త టైం టేబుల్

ఉదయం 5గంటలకు విద్యార్థులకు వేకప్ కాల్‌తో దినచర్య ప్రారంభమవు తుంది. 6గంటల వరకు యోగా పూర్తవు తుంది. 6నుంచి 7 వరకు విద్యార్థులు కాల కృత్యాలు, స్నానాలు పూర్తి చేసుకుంటారు. 7 నుంచి 7:45 వరకు బ్రేక్‌ఫాస్ట్‌తోపాటు పాలు, రాగి జావను తీసుకుంటారు. ఉదయం 8 నుంచి 8:15 వరకు ప్రేయర్, తర్వాత 8:15 నుంచి 11:15 వరకు 45 నిమిషాలకు ఒకటి చొప్పున నాలుగు పీరియడ్లు ఉంటాయి. అనంతరం 10 నిమిషాల షార్ట్ బ్రేక్ ఉంటుంది. 11:25 గంటల నుంచి 5, 6 పీరి యడ్లు ఉంటాయి. మధ్యాహ్నం 1:25గంటల నుంచి 2:15గంటలకు మధ్యాహ్న భోజనం ఉంటుంది. దాదాపు ఐదున్నర గంటలకు పైగా విద్యార్థులకు మధ్యలో ఎలాంటి స్నాక్స్, ఇతర భోజన పదార్థాలు లేకుండా ఏకదాటిగా విద్యాబోధన జరుగుతుంది. దీంతో ఎదుగుతున్న వయస్సులో ఉన్న విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు సాయంత్రం 4:30 నుంచి 4:45 వరకు స్నాక్స్, 6:15 నుంచి 7 గంటల వరకు రాత్రి భోజనం (డిన్నర్) ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర స్కూల్ ఎడ్యు కేషన్ విభాగం నుంచి జీవో 16ప్రకారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

విద్యార్థులకు అనారోగ్య సమస్యలు

విద్యార్థులు సరైన సమయానికి భోజనం చేయకపోవడంతో జీర్ణ సమస్యలు ఎదురవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ప్రస్తుతం 5,6,7 తరగతులకు మెస్ చార్జీ కింద నెలకు 950 రూపాయలు, 8,9,10 తరగతులకు 1,100, ఇంటర్ విద్యార్థులకు 1,500 రూపాయలు ప్రభుత్వం చెల్లిస్తోంది. ఇవి సరిపోవడం లేదని, గతంలోనే పలు విద్యార్థి సం ఘాలు ఆందోళన చేశాయి. 5,6,7 తరగతులకు 1200 రూపాయలు, 8,9,10 తరగతులకు 1,500 రూపాయలు, ఇంటర్ విద్యార్థులకు రెండు వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఒప్పుకున్నా ఆచరణలో మాత్రం అమలు కావడం లేదు. విద్యార్థులకు విద్యతోపాటు ఆహారం, భోజన సౌకర్యంపై శ్రద్ధ తీసుకోవాల్సిన ప్రభుత్వం టైం టేబుల్ పేరుతో సరైన సమయానికి భోజనం అందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని పునః పరిశీలించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

వైద్య పరీక్షలపై అవగాహన కరువు

- ఆరోగ్య కేంద్రాల్లో ప్రతీ మంగళవారం పరీక్షలు
- గ్రామాల్లో ప్రచారం చేయకపోవడంతో సద్వినియోగం చేసుకోలేకపోతున్న మహిళలు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 19: ప్రభుత్వం జిల్లాలోని కొన్ని ఆరోగ్య కేంద్రాల్లో 'ఆరోగ్య మహిళ' కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తోంది. ఈ విషయంపై గ్రామాల్లో అవగాహన కల్పించకపోవడంతో మహిళలు వినియోగించుకోలేకపోతున్నారు. గ్రామీణ మహిళలు పౌష్టికాహారలోపం, దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్నారు. వ్యాధిని గుర్తించే సరికి తీవ్రమై ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమంలో ప్రతి మంగళవారం మహిళలకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారు. ఎవరికైనా అత్యవసర చికిత్సలు అవసరముంటే పెద్ద ఆసుపత్రులకు రెఫర్ చేస్తారు.

ఆహార అలవాట్లు.. వాతావరణ మార్పులు..

గ్రామాల్లో ఉండే మహిళలు ఉదయం అల్పాహారం తీసుకోవడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తుంటారు. ముఖ్యంగా పనులకు వెళ్లే మహిళలు ఉదయం ఆహారం తీసుకోకపోవడంతో వివిధ రకాల రుగ్మతలు సంక్రమిస్తున్నాయి. ఆహార అలవాట్లు, ఒత్తిడి, ఆందోళనలతో ఇటీవల కాలంలో ఎక్కువ మంది మహిళలు హార్మోన్ల అసమతుల్యత, థైరాయిడ్ భారిన పడుతున్నారు. సహజ ప్రక్రియ అయినా మోనోపాజ్‌తో సతమతమవుతున్నారు. పలువురు రక్తహీనతతో బాధపడుతున్నారు. 30 ఏళ్లకుపైన మహిళలకు మధుమేహం, రక్తపోటు వ్యాధులు సంక్రమిస్తున్నాయి. ప్రభుత్వం నిర్వహించే మంగళవారం వైద్య సేవలు వీరికి అందితే వ్యాధులకు అరికట్టే అవకాశం ఉంది.

ఎనిమిది రకాల వైద్య పరీక్షలు

రాష్ట్ర ప్రభుత్వం మహిళలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక దృష్టి సారించింది. కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలోని చెల్పూర్ పీహెచ్‌సీలలో ఇటీవల 'మంగళవారం' వైద్య సేవలు ప్రారంభమయ్యాయి. ఆరోగ్య మహిళ కార్యక్రమం కింద క్లినికల్ రొమ్ము పరీక్ష, విజువల్ ఎసిటిక్ యాసిడ్ ద్వారా పరీక్ష, నోటి కుహర పరీక్ష, సూక్ష్మ పోషకాల లోప పరీక్ష, స్ట్రిప్ విధానం పరీక్ష, మెనోపాజ్ పరీక్ష, నిర్వహణ, అనుమానిత పీసీఓడి పరీక్ష, అనుమానిత ఎస్‌టీఐ, మూత్ర నాళ వ్యాధి గుర్తింపు, బరువు నిర్వహణ, సమస్యల గుర్తింపు, మధుమేహం, రక్తపోటు, థైరాయిడ్ ఇతర అవసరమైన రక్త పరీక్షలన్నీ ఉచితంగా నిర్వహించి మందులు పంపిణీ చేస్తారు.

మాకు తెలియదు.. : వేముల కృష్ణవేణి, రాంపూర్



ప్రతి మంగళవారం పీహెచ్‌సీకి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు అనే విషయం మాకు తెలియదు. పీహెచ్‌సీ మా ఊరికి దూరంగా ఉంది. ఫలి తంగా వైద్య పరీక్షలకు దూరం కావాల్సి ఉంటుంది. కార్యక్రమంపై గ్రామంలో ప్రత్యేక అవగాహన కల్పించాలి.

ప్రత్యేక వాహనం సమకూర్చాలి

: పల్లవేని కొమురమ్మ, కనుకులగిద్దె



వాహన సదుపాయం లేని గ్రామాలకు ప్రతి మంగళవారం వాహన సదుపాయం కల్పించి పీహెచ్‌సీకి వెళ్లేలా చూడాలి. వాహన సదుపాయం లేకపోవడంతో పీహెచ్‌సీ వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

అవగాహన కల్పిస్తున్నాం

డాక్టర్ మధుకర్, మెడికల్ ఆఫీసర్, చెల్పూర్ పీహెచ్‌సీ



'ఆరోగ్య మహిళ' కార్యక్రమంలో ఆయా రుగ్మతలతో బాధపడే వారికి అవగాహన కల్పిస్తున్నాం. వ్యాధి లక్షణా లుంటే జిల్లా ఆసుపత్రికి లేదా హైద్రాబాద్‌కు పంపుతు న్నాం. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరోగ్య మహిళ కార్యక్రమంపై అవగాహ న కల్పిస్తున్నాం. ఎనిమిది రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారం. మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

అవగాహన లోపంతో..

గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలకు ప్రభుత్వ ప్రత్యేక వైద్య సేవలపై అవగాహన లేకపోవడంతో ప్రభుత్వ సేవలను వినియోగించుకోలేకపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కీలక వైద్య సేవలు అందించే ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు ఆరోగ్య మహిళ కార్యక్రమంపై పటిష్ట అవగాహన కల్పించాల్సి ఉంది. వారికి చాలీచాలని జీతాలు, పని ఒత్తిడి మూలంగా ఆరోగ్య మహిళ కార్యక్రమం అమ లుపై ప్రభావం చూపుతోంది. ఉన్నతాధికారులు స్పందించి ఆరోగ్య మహిళ కార్యక్రమం అమలు చేయాల్సిన అవసరం ఉంది.



నిలిచిన 'మీ సేవ'లు

- పది రోజులుగా సర్వర్ సమస్య
- విద్యార్థులు, రైతులకు సర్టిఫికెట్ల జారీకి ఇబ్బందులు

భగత్‌నగర్, సెప్టెంబరు 19: సర్వర్ సమస్య కారణంగా మూడు రోజులుగా మీ సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. పది రోజుల క్రితమే ఈ సమస్య ఉత్పన్నమైంది. అప్పటి నుంచి పాక్షికంగా నడుస్తున్న మీ సేవ కేంద్రాలు సమస్య మరింత తీవ్రమై మూడు రోజులుగా సేవలందించలేని స్థితికి చేరు కున్నాయి. జనన, మరణ సర్టిఫికెట్ల జారీ, ఐజీఆర్ సర్వీస్‌కు సంబంధించి ఈసీ సర్టిఫైడ్ కాపీలు కూడా ప్రజలకు అందడం లేదు. కోర్టుకు సమర్పిం చాల్సిన ఈ సర్టిఫికేట్లు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో రోజుకు సుమారు లక్షా యాభై వేల లావాదేవీలు జరుగగా ప్రస్తుతం అవి యాభై వేలకు పడిపోయాయని నిర్వాహ కులు చెబుతున్నారు. సర్వర్ డౌన్ అయినా పాక్షికంగా ఒకటి అర సర్టిఫికెట్లు అందిస్తున్న నిర్వాహకులు ప్రజల ఒత్తిడి తట్టుకోలేక కేంద్రాలను మూసివేస్తున్నారు.



జిల్లాలో 206 మీ సేవ కేంద్రాలు

జిల్లాలో 206 మీసేవ కేంద్రాల్లో ఇదే పరిస్థితి ఉండడంతో విద్యార్థులు, రైతులు అవసరమైన సర్టిఫికెట్లు పొందలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మొదటే అంతంత ఆదాయం ఉన్న మీ సేవ నిర్వాహకులు పది రోజులుగా సేవలు నిలిపివేయాల్సి రావడంతో ఆదాయం లేక అద్దె, కరెంట్ బిల్లులు కట్టలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ప్రస్తుతం పహాణి, 1బి, ఓటర్ గుర్తింపు కార్డు, రేషన్ కార్డు సర్వీసులు మీ సేవ నుంచి తొలగించడంతో మీ సేవ కేంద్రాలకు వచ్చే ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది.

దీంతో ఇంటి అద్దెలు, కరెంట్ బిల్లులు చెల్లించ లేక పోతున్నామని నిర్వాహకులు అంటున్నారు. పది సంవత్సరాలుగా మీసేవ సర్వీసు చార్జీలను పెంచకపోవడంతో ఖర్చులకు సరిపడా ఆదాయం రాక ఇబ్బంది పడుతున్నామని నిర్వాహకులు అంటున్నారు. మీసేవ కేంద్రాలకు టార్గెట్ పెట్టి ట్రాన్‌సాక్షన్‌లు లేవనే కారణంగా సెంటర్‌లను మూసివేస్తామని నోటీసులు ఇస్తూ ఒత్తిడి పెంచడంపై నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్వీసు చార్జీలను పెంచడంతో పాటు మరిన్ని సేవలను మీసేవ ద్వారా అందించేందుకు ప్రభుత్వం అనుమతిం చాలని వారు కోరుతున్నారు. సర్వర్ అప్‌గ్రేడేషన్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యను తొలగించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

పారిశుధ్య కార్మికుల భద్రత అందరి బాధ్యత

కలెక్టర్ పమేలా సత్పతి



మానకొండూర్‌లో మొక్కలను నాటుతున్న కలెక్టర్ పమేలాసత్పతి

మానకొండూర్, సెప్టెంబరు 19: పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం, సంక్షేమం, కుటుంబ భద్రతపై అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మానకొండూర్ పీహెచ్‌సీలో స్వచ్ఛత హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించి హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు బాగుంటేనే గ్రామాలు బాగుంటాయన్నారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా జీవనజ్యోతి బీమా యోజన, సురక్ష యోజన, ఆరోగ్య సంరక్షణ కార్డులు, రక్షణ కవచాలు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో 1300 మంది పంచాయతీ, మున్సిపల్ కార్మికులకు కార్డులను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్మికులు పనులకు వెళ్లేటప్పుడు ఆరోగ్య కార్డులు వెంట ఉంచుకోవా లని సూచించారు. విధులు ముగించుకున్న తర్వాత తప్పని సరిగా స్నానం చేసి ఇళ్లకు వెల్లాలని అన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, యూనిసెఫ్ రాష్ట్ర వాష్ స్పెషలిస్టు వెంకటేశ్, డీఆర్డీవో వి శ్రీధర్, డీఎంహెచ్‌వో సుజాత, జిల్లా సమన్వయకర్త కిషన్‌స్వామి, ఎంపీడీవో వరలక్ష్మి, సీహెచ్‌సీ వైద్యులు సౌమ్య, నర్సింహారెడ్డి, ఫణీంద్ర, రమేశ్, వేణు పాల్గొన్నారు.

కమ్యూనిస్టులు భూపోరాటాలకు సిద్ధం కావాలి

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం



సభలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19: కమ్యూనిస్టులు భూపోరాటాలకు సిద్ధం కావాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం పిలుపునిచ్చారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సభ కరీంనగర్ సీపీఐ జిల్లా సమితి ఆధ్వర్యంలో గురువారం ప్రెస్‌భవన్‌లో జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పాత్ర లేదని సాయుధ పోరాట చరిత్ర వక్రీకరణకు గురవుతుందన్నారు. కమ్యూనిస్టులు వాస్తవాలు ప్రజలకు వివరించాలన్నారు. నిజాం రజాకార్ల దౌర్జన్యాలను ఎదిరిస్తు 1947 సెప్టెంబరు 11న ఆంధ్ర మహాసభ కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దుం మొహియుద్దీన్ పిలుపునిచ్చారన్నారు.

సాయుధ పోరాటంలో దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగీ లాంటి వారు వీరోచిత పోరాటం చేశారన్నారు. కమ్యూనిస్టు శ్రేణులు జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు సాయుధ పోరాట చరిత్రను వివరించాలన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్ బాల మల్లేష్ మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో సాయుధ పోరాటం సువర్ణ అక్షరాలతో లిఖించదగినదన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలన అని, బీజేపి విమోచన మని రకరాల పేర్లతో సాయుధ పోరాట చరిత్రను అపహాస్యం చేస్తున్నాయన్నారు. సాయుధ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చి పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్మృతి వనాలు, స్మారక విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ సిద్దిపేట, రాజన్న సిరిసిల్ల జిల్లాల కార్యదర్శి మంద పవన్, గుంటి వేణు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొనగంటి కేదారి, జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు కిన్నెర మల్లవ్వ, బీర్ల పద్మ, కటికరెడ్డి బుచ్చన్న యాదవ్, బోయిని తిరుపతి, పిట్టల సమ్మయ్య, గొడిశెల తిరుపతిగౌడ్, కాంతాల అంజిరెడ్డి, పైడిపల్లిరాజు, గజ్జి అయిలయ్య, నలువాల సదానందం పాల్గొన్నారు.

విద్యా సంస్థల్లో యువ టూరిజం క్లబ్బుల ఏర్పాటు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లో యువ టూరిజం క్లబ్బులు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు జిల్లా టూరిజం అధికారి ఎం వెంకటరాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్లబ్బులు రాష్ట్రంలోని స్కూల్స్, ఇంటర్, డిగ్రీ, పీజీ కళాశాలలతోపాటు, ప్రొఫెషనల్, వొకేషనల్ విద్యా సంస్థల్లో యువ టూరిజం క్లబ్బులను ఏర్పాటు చేయనున్నారు. ప్రతి క్లబ్‌లో 25 మందితో కలిపి క్లబ్‌ను ఏర్పాటు చేసుకోవాలని క్లబ్ పర్య వేక్షణకు ఒక టీచర్, లెక్చరర్, కో-ఆర్డినేటర్‌ను నియమించనున్నారు. కలెక్టర్ వీటికి చైర్‌పర్సన్‌గా కొనసాగుతూ ఈ నెల 27 వరల్డ్ టూరిజం డే లోపే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు, యువతకు, క్విజ్, వ్యాసరచన, లోగో డిజైన్స్ పోస్టర్ పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారానికి టూరిజం వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



మాట్లాడుతున్న ఖాదీ మానె మిల్లత్ కార్యదర్శి సమద్ నవాబ్

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 19: మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని మిలాద్ ఉన్ నబీ వేడుకలను గురువారం ముస్లింలు ఘనంగా జరుపుకు న్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రసంగాలు, ప్రవచ నాలు విన్నారు. దివ్య ఖురాన్ పఠనం చేశారు. ర్యాలీలు నిర్వహించారు. పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేశారు. కార్ఖానగడ్డ, హుస్సేన్‌పురా వద్ద గల బొంబాయి స్కూల్ నుంచి మర్కజ్ మిలాద్ కమి టీ అధ్యక్షుడు సయ్యద్ షా ఖాలిద్ మొహియొద్దీన్ (ఫరీద్‌బాబా) ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గులాం రబ్బాని, ఉపాధ్యక్షుడు జావిద్, ముఫ్తి నదీమ్, మౌలానా మహమ్మద్ షా ఖాద్రి, ఎండి జమీలొద్దీన్, అక్బర్ హుస్సేన్, షేక్ హుస్సేన్, సమద్ నవాబ్, హబీబొద్దీన్ హాజి, షౌకత్ అలీ, నవాజ్, కరీంనగర్ సదర్ ఖాజీ మన్ ఖబత్ షా ఖాన్ పాల్గొన్నారు. తెలంగాణచౌక్ వద్ద మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావుతో పాటు పలువురు మత పెద్దలు శాంతి, సామరస్యం, పరమత సహనం, ప్రేమ, సౌభ్రాతృత్వం వంటి అంశాలపై ప్రసంగించారు. గోదాంగడ్డలోని ఎస్‌బీ ఎస్ ఫంక్షన్ హాల్లో మేయర్ యాదగిరి సునీల్‌రావు ముస్లింలకు అన్నదానం ఏర్పాటు చేశారు.



మిలాద్ ఉన్‌నబీ సందర్భంగా నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

పటిష్ట బందోబస్తు

కరీంనగర్ క్రైం: మిలాద్-ఉన్‌బీ-నబి ర్యాలీ సందర్భంగా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ నగరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పూర్తి స్థాయిలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు.

జ్వరంతో మహిళ మృతి

చిగురుమామిడి, సెప్టెంబరు 19: చిగురుమామిడికి చెందిన సిరవేణి శిరీష (30) అనే మహిళ గురువారం జ్వరంతో మృతి చెందింది. శిరీష వారం రోజు లుగా తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. స్థానికంగా చికిత్స తీసుకున్న ప్పటికీ తగ్గలేదు. గురువారం తీవ్ర జ్వరంతో అపస్మారక స్థితికి చేరింది. కుటుంబ సభ్యులు హుస్నాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు. వైద్యులు శిరీషను పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. త న కూతురు జ్వరంతోనే మృతి చెందిందని తండ్రి పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బండి రాజేశ్ తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రిలో రోగి మృతి

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆరోపణ

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గొల్లపల్లి రోడ్డులో గల ఓ ప్రైవేటు ఆసుపత్రిలో శస్త్ర చికిత్స కోసం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకవెళ్లిన రోగి మృతి చెందిన సంఘటన గురువారం కలకలం రేపింది. వైద్యుల నిర్లక్ష్యంతోనే ఆపరేషన్ గదిలో రోగి మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిని నిలదీశారు. మల్యాల మండల కేంద్రానికి చెందిన వంగల మహిత (38) మూడు రోజుల క్రితం గర్భసంచి నొప్పితో ఆసుపత్రిలో చేరింది. ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించాలని వైద్యులు నిర్ణయించారు. శస్త్ర చికిత్స కోసం మత్తు ఇంజక్షన్ ఇవ్వగానే మహిళ గుండెపోటుకు గురై మృతి చెందిందని బంధు వులకు వైద్యులు తెలిపారు. ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యం కారణంగా మహిత మృతి చెందిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఐఎంఏ నేతలు ఆసుపత్రికి వచ్చి పరిస్థితిని పరిశీలించారు. బాధిత కుటుంబానికిన్యాయం చేస్తామని ఆసుపత్రి నిర్వాహకులు హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది. కాగా మృతురాలు మహితకు భర్త రమేశ్, కూతురు మైథిలి, కుమారుడు సాయి ఉన్నారు.

దాడికి పాల్పడిన ఒకరిపై కేసు నమోదు

జమ్మికుంట, సెప్టెంబరు 19: జమ్మికుంట మండలం వావిలాల గ్రామానికి చెందిన పెరుగు శ్రీనివాస్‌పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు గురువారం తెలిపారు. పెరుగు శ్రీనివాస్-సుజాత దంప తుల కుమార్తెకు గత నెల నిశ్చితార్థం జరిగింది. శ్రీనివాస్ ఈ నెల 18న గ్రామంలోని చికెన్ సెంటర్ వద్ద కూర్చోని ఉన్నాడు. అదే సమయంలో అక్కడికి మద్యం సేవించి వచ్చిన పెరుగు సిజిత్ తనను నిశ్చితార్థానికి పిలువ లేదంటూ గొడువకు దిగాడు. పక్కనే ఉన్న కర్ర తీసుకోని శ్రీనివాస్‌పై దాడి చేయడంతో గాయాలయ్యాయి. శ్రీనివాస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రవి తెలిపారు.

ధరణి ఆపరేటర్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు

శంకరపట్నం, సెప్టెంబరు 19: గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమి పత్రాలు ఇవ్వడం లేదని ధరణి ఆపరేటర్‌పై గురువారం కరీంపేటకు చెందిన మేడిశెట్టి బక్కవ్వ కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కరీంపేట గ్రామానికి చెందిన మేడిశెట్టి బక్కవ్వ వ్యవసాయ భూమిని ఆమె కోడళ్లు మేడిశెట్టి రాజమ్మ, మేడిశెట్టి స్వరూప, మనుమడు మేడిశెట్టి రాకేష్, మనమరాళ్లు స్వప్న, రజిత, స్రవంతి, వనమల పేరిట చేసేందుకు గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ కోసం ఇటీవల ఓ ప్రైవేట్ వ్యక్తి వద్ద స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆ తేదీ ప్రకారం తహసీల్దార్ కార్యాలయంలో వీరు పేరు మీద బక్కవ్వ పేరు నుంచి గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్ తహసీల్దార్ భాస్కర్ చేశారు. అదేరోజు సాయంత్రం డాక్యుమెంట్లు ఇవ్వకుండా సాంకేతిక కారణాలు ఉన్నాయని చెప్పారు. అనంతర పలుమార్లు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చినా సిబ్బంది ఇవ్వడం లేదని చెప్పారు. తహసీ ల్దార్‌ను కలిసి డాక్యుమెంట్లు ప్రైవేట్ వ్యక్తి వద్ద ధరణి ఆపరేటర్ మా మూళ్ల కోసం దాచి పెట్టాడని, ఇప్పించాలని వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ ధరణి ఆపరేటర్‌ను పిలిపించి డాక్యుమెంట్లను వారికి ఇప్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

ఇల్లందకుంట, సెప్టెంబరు 19: మండలంలోని సిరిసేడు గ్రామ శివారులో గురువారం ఓ యువకుడు బైక్ అదుపు తప్పి పడిపోవడంతో తలకు గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ రాజకుమార్ తెలిపిన వివరాల ప్రకారం టేకుమట్ల మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన కన్నూరి రమేశ్‌కు ముగ్గురు కుమారులు. పెద్ద కుమారుడైన కన్నూరి ప్రభంజన్ (21) గురువారం తన వ్యక్తిగత పని మీద జమ్మికుంటకు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో ఇల్లందకుంట మండలంలోని సిరిసేడు గ్రామ శివారులో తన బైక్ అదుపు తప్పి కింద పడగా తలకు తీవ్రగాయమై మృతి చెందాడు. ప్రభంజన్ తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

గంభీరావుపేటలో అగ్ని ప్రమాదం

- ఇల్లు, కిరాణషాపు దగ్ధం - భారీగా ఆస్తి నష్టం

గంభీరావుపేట, సెప్టెంబరు 19: గంభీరావుపేట మండల కేంద్రంలోని మేయిన్‌రోడ్‌లో బచ్చు కృష్ణమూర్తి ఇంట్లో, కిరాణ షాపులో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం సంభవించింది. కృష్ణమూర్తి కుటుంబం మూడు రోజుల కిందట హైదరాబాద్‌లో ఉన్న వారి సమీప బంధువుల వద్దకు వెళ్లారు. ఉన్నట్టుండి గురువారం రాత్రి కృష్ణమూర్తి ఇంట్లో మంటలు చెలరేగాయి. సమీప ప్రజలు మంటలను గుర్తించి, పోలీస్‌లకు, ఇంటి వారికి సమాచారం ఇచ్చారు. ఇంటికి, కిరణా షాపునకు తాళాలు వేసి ఉండటంతో మంటలు ఆర్పడం కొంత కష్టమైంది. దీంతో కిరాణషాపు షెట్టర్లను పగుల గొట్టి లోనికి ప్రవేశించి, స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. మంటలు మరింత చెలరేగడంతో ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందించారు. అప్పటికే కిరాణషాపులోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. ఇంట్లోని ఫ్రిడ్జ్, బీరువా, ఫ్యాన్లు, మంచాలు, కుర్చీలు, విలువైన పరికరాలు మంటల్లో పూర్తిగా కాలిపోయాయి. ఇంట్లో, పక్క ఇంట్లో కూడా గ్యాస్ సిలిండర్లు ఉండటంతో సమీప ప్రజలు భయందోళనలకు గురయ్యారు. సిలిండర్ల వద్దకు మంటలు వ్యాపించకుండా యువకులు సాహసంతో సిలిండర్లను బయటకు తెచ్చారు. ఫైర్ ఇంజన్ వచ్చాక మిగిలిన మంటలను సిబ్బంది ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు బావిస్తున్నారు. ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మంటలను ఆర్పే సహాయక చర్యల్లో పాల్గొన్న యువకులను గ్రామస్తులు అభినందించారు. స్థానిక ఎస్ఐ రాంమోహన్, పలువురు నాయకులు, యువకులు, పోలీస్ సిబ్బంది వచ్చి, మంటలను ఆర్పే వరకు సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

సీడ్ ఆర్గనైజర్ నుంచి డబ్బులు ఇప్పించాలి

- పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 19: మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన ఇరుమల్ల సురేందర్‌రెడ్డి తనకు సీడ్ ఆర్గనైజర్ దగ్గర నుంచి డబ్బులు ఇప్పించాని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనకున్న ఆరు ఎకరాల భూమిలో శ్రీజ కంపెనీకి చెందిన ఆర్గనైజర్ చిన్నపాపయ్యపల్లి గ్రామానికి చెందిన గిసిడి కొండల్‌రెడ్డి, మరో ఆర్గనైజర్ సంతోష్ అనే వ్యక్తులు ఎకరానికి లక్ష 20 వేల రూపాయల దిగుబడి వస్తుందని ఆశ చూపి సీడ్ సాగు చేయించారని చెప్పాడు. పంట సాగు చేస్తున్న క్రమంలో పరిశీ లనకు రమ్మని ఎన్నిసార్లు ఫోన్ చేసిన స్పందించలేదని తెలిపాడు. పురుగు ఉధృతిని తగ్గించేందుకు పలుమార్లు మందు స్ప్రే చేయడంతో దిగు బడి తగ్గిందని వాపోయాడు. ఒప్పందం ప్రకారం డబ్బులు ఇస్తామని చెప్పి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పాడు. తనకు తెలియకు ండానే తన ఖాతాకు 4 లక్షల 75 వేల నగదును పంపించారని చెప్పాడు. మిగతా 2 లక్షల 45 వేల రూపాయల కోసం ఆర్గనైజర్స్ ఇంటికి వెళ్తే స్పందించడం లేదని తెలిపాడు. తన ఖాతాకు వచ్చిన డబ్బులకు చెక్కు ఇచ్చానని అన్నాడు. గ్రామంలో మరో 50 మం ది రైతులను ఇలానే మోసం చేశారని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరాడు.

వృద్ధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: విశిష్ట సేవలు అందించిన వయోవృద్ధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీ య వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విశిష్ట సేవలు అందించడంలో నిమగ్నమైన అర్హతల కలిగిన సంస్థలకు, సంస్థల ప్రతినిధులకు రాష్ట్ర స్థాయి అవార్డులు అందించనున్నట్లు తెలిపారు. ఈనెల 25లోపు హైదరాబాద్‌లోని వికలాంగుల వయో వృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం మలక్‌పేట నందు దరఖాస్తులు సమర్పించాలన్నారు. 9652394751, 040-245590480 నంబర్‌లలో సంప్రదించాలన్నారు.

23నుంచి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19: జిల్లా స్థాయి పాఠశాలల క్రీడా సమాఖ్య కబడ్డీ పోటీలను ఈనెల 23,24 తేదిల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల హుజూరాబాద్ మైదానంలో నిర్వహించనున్నారని జిల్లా ఎస్జీఎఫ్ కార్యదర్శి వేణుగోపాల్ తెలిపారు. 23న అండర్ 17 బాల బాలికలకు, 24న అండర్ 14 బాలబాలికలకు కబడ్డీ పోటీలను హుజూరాబాద్ మండల కన్వీనర్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, నిర్వహణ కార్యదర్శి పిడి సొల్లు సారయ్యల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని తెలిపారు. జిల్లా లోని 16 మండలాల క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని పేర్కొ న్నారు. ఎంపికైన వివిధ మండలాల క్రీడాకారులు మండల కన్వీనర్ కార్యదర్శుల సంతకంతో కూడిన అర్హత ధ్రువపత్రాలతో నిర్వహకులకు ఉదయం తొమ్మిది గంటలకు రిపోర్ట్ చేయాలని సూచించారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచిన బాలబాలికలను త్వరలో నిర్వహించే జోనల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు సొల్లు సారయ్య 9391739736 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు



ఆర్టీసీ ఉద్యోగులకు అవార్డులు అందిస్తున్న అధికారులు

భగత్‌నగర్, సెప్టెంబరు 19 : కరీంనగర్ రీజియన్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం త్రైమాసిక అవార్డులను అధికారులు అందించారు. గురువారం కరీంనగర్‌లోని డాక్టర్ అంబేద్కర్ బస్‌స్టేషన్ సమావేశ మందిరంలో రీజినల్ మేనేజర్ సుచరిత ఆధ్వర్యంలో అవార్డులను అందించారు. వివిధ కేటగిరీలకు చెందిన 28మంది ఉద్యోగులను నగదు పురస్కారాలతో సత్కరించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ మాట్లాడుతూ రీజియన్‌ను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలుపుటకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి రీజినల్ మేనేజర్లు ఎస్ సత్యనారాయణ, ఎస్ భూపతిరెడ్డి, అకౌంట్స్ ఆఫీసర్ సీహెచ్ వెంకటేశ్వర్లు పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డిపో మేనేజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష

జ్యోతినగర్, సెప్టెంబరు 19 : ఆర్ఎఫ్‌సీఎల్ సమీపంలో 2023 ఫిబ్రవరి 18న కొయ్యాడ వెంకన్నగౌడ్ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో గోదావరిఖనికి చెందిన ఎస్.కె.సమీర్(19), సయ్యద్ వాజీద్(25)లకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ గోదావరిఖని సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జి బి.శ్రీనివాసులు గురువారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్కలపల్లిగేట్ నుంచి ఆర్ఎఫ్‌సీఎల్ ప్లాంటు సమీపంలోని అయ్యప్పగుడి ఎదురుగా ఉన్న కల్లు దుకాణంకు సమీర్, వాజీద్ తరచూ వచ్చి బీర్లు తాగేవారు. అయితే ఇక్కడ మద్యం తాగవద్దని వెంకన్నగౌడ్ ఆ ఇద్దరు వ్యక్తులను వారించాడు. దీంతో కోపం తెచ్చుకున్న సమీర్, వాజీద్‌లు కత్తితో వెంకన్నగౌడ్‌పై దాడి చేసి విచక్షణారహితంగా పొడిచి గాయపరిచారు. బాధితుడి కొడుకు సుధాకర్ ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్ఐ జీవన్ ఆ ఇద్దరిపై కేసు నమోదు చేశారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. కేసు ట్రయల్‌లో భాగంగా ప్రస్తుత ఎన్టీపీసీ ఎస్ఐ సతీష్ సాక్షులను అదనపు పీపీ ఆకుల రాములు ఆధ్వర్యంలో కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి బి.శ్రీనివాసులు ఇద్దరు నిందితులను దోషులుగా తేల్చారు. సమీర్, వాజీద్‌లకు 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి 3 వేల రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జరిమానా కట్టని పక్షంలో అదనంగా 6 నెలలు జైలుశిక్ష విధించారు. సాక్షులను ప్రవేశపెట్టడంలో సహకరించిన కోర్టు కానిస్టేబుల్ బుర్ర శ్రీనివాస్, హోంగార్డు పూరెల్ల శ్రీనివాస్‌లను రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ సతీష్ అభినందించారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద

జగిత్యాల, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): శ్రీరాం సాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. 4,140 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర ములకు కలిపి ప్రాజెక్టు నుంచి 10,940 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 2,000 క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 550 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, అల్లీ సాగర్ ఎత్తిపోతల పథకానికి 180 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసె క్కులు విడుదల అవుతుండగా 709 క్యూసె క్కుల నీరు ఆవిరి అవుతోంది. జూన్ 1వ తేదీ నుంచి ఇప్ప టివరకు ప్రాజెక్టులోకి 185.742 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

ఎన్టీపీసీలో వ్యాపారి ఇంట్లో చోరీ

- 9 తులాల బంగారు నగలు, కిలో వెండి, రూ 1.50 లక్షల నగదు అపహరణ



దొంగలు విరగ్గొట్టిన తలుపు గడియ.. చోరీ జరిగిన ఇంట్లో తనిఖీ చేస్తున్న పోలీసులు

జ్యోతినగర్, సెప్టెంబరు 19 : గోదావరిఖని ఎన్టీపీసీ కృష్ణానగర్‌లో తులసి హరిప్రసాద్ రావు(అబ్బులు) అనే వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. ఇంటి తలుపు గడియను విరగ్గొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు ఇంట్లో ఉన్న తొమ్మిది తులాల బంగారు ఆభరణాలు, కిలోవెండి, 1,50,000 రూపాయల నగదు, 25 ఖరీదైన చీరలను అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 16న అనారోగ్యంతో ఉన్న బంధువులను చూసేందుకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో హరిప్రసాద్‌రావు సూర్యా పేటకు వెళ్లాడు. గురువారం తిరిగి ఇంటికి వచ్చిన హరిప్రసాద్‌రావు చోరీ జరిగిన విషయం గుర్తించి ఎన్టీ పీసీ పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న ఎన్టీపీసీ ఎస్ఐ సతీస్, పోలీసులు, సీసీఎస్ పోలీసులు దేవేందర్‌గౌడ్ (హెచ్‌సీ), రాజమౌళి (పీసీ)లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కమిషనరేట్‌కు చెందిన డాగ్ స్క్వాడ్‌తో పరిసరాలను తనిఖీ చేశారు. ఫింగర్ ప్రింట్ బృందం చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరించింది. అర్ధరాత్రి సమయంలో చోరీ జరిగినట్లు తెలుస్తున్నది. బీరువా డోర్‌ను పగులగొట్టి అందులో ఉన్న నగలు, నగదు, చీరలను ఎత్తుకెళ్లినట్టు తెలు స్తున్నది. ఇంటి యజమాని హరిప్రసాద్ కుందనపల్లిలో పెట్రోల్‌బంక్ నడుపుతు నాడు. కృష్ణానగర్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నట్లు సమా చారం. ఎన్టీపీసీ, సీసీఎస్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



ఎస్సారెస్పీ కెనాల్‌కు పడిన గండి (ఫైల్)

పరిహారం.. పరిహాసం

- 2016లో ఎస్సారెస్పీ కెనాల్‌కు గండి
- నీట మునిగిన వందలాది ఎకరాల్లోని పంటలు
- పరిహారం కోసం ఎదురుచూస్తున్న రైతులు

మల్యాల, సెప్టెంబరు 19 : ఎస్సారెస్పీ కెనాల్ తెగి కాలువ నీరు పంటలను ముంచెత్తింది. పొలాల్లో ఇసుక మేటలు వేసింది.. ఇళ్లన్నీ జలమయం అయ్యాయి.. మంత్రులు, అధికారులు, ఆఖరికి కేంద్రం నుంచి బృందం కూడా వచ్చి అయ్యో పాపం అంది.. పరిహారం ఇస్తాం.. ఆదుకుంటాం అన్నారు. ఇదంతా ఎనిమిదేళ్ల క్రితం మాట... అయినా ఇప్పటికీ పరిహారం జాడలేదు. వివరాల లోకి వెళ్తే.. మల్యాల మండలం మానాల శివారులో గల ఎస్సారెస్పీ కాకతీయ కాలువ డి-65 వద్ద 2016 సెప్టెంబరు 20న గండి పడి సమీప దమ్మక్క చెరువు, మ్యాడంపెల్లిలోని చెరువులు నిండి పంట పొలాలను ముంచెత్తాయి. మ్యాడంపెల్లిలో ఇళ్ల నుంచి వరద వెళ్లగా ఇళ్లన్నీ జలమయం అయ్యాయి. బాధితులు రెండు రోజుల పాటు ఇళ్లు ఖాళీ చేశారు. వందకు పైగా ఇళ్లకు నష్టం జరిగితే 28 ఇళ్లకు మాత్రమే నష్టం జరిగిందని ప్రభుత్వానికి నివేదికలు పంపారు. ఇక వందలాది ఎకరాల పంటలకు నష్టం వాటిళ్లగా పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. అప్పటి రాష్ట్రమంత్రులు ఈటల రాజేందర్, హరీష్‌రావులు వచ్చి రైతులను ఓదా ర్చారు. ఆదుకుంటామన్నారు. అనంతరం 2016 నవంబర్ 13న కేంద్ర బృందం కూడా వచ్చి రైతుల నుంచి నష్టం వివరాలు తెలుసుకున్నారు.

● నష్టం వివరాలు ఇవి

ఎస్సారెస్పీ కాకతీయ కెనాల్‌కు గండి పడటంతో నష్టం వాటిల్లిన పంటలపై రెవెన్యూ వ్యవసాయాధికారులు ప్రభుత్వానికి నివేదిక రూపొందించి పంపించారు. మానాల గ్రామ పరిధిలో 16 మందికి చెందిన 274 హెక్టార్లలో వరి, 0.40 హెక్టార్లలో ముగ్గురు రైతులకు చెందిన మొక్కజొన్న, 30 మందికి చెందిన 7.49 హెక్టార్ల పంట భూముల్లో ఇసుక మేటలు వేసింది. మ్యాడంపెల్లి పరిధిలో 40 మందికి చెందిన 7.23 హెక్టార్లలో వరి, నలుగురికి చెందిన 0.48 హెక్టార్లలో మొక్కజొన్న, ఒక్క రైతు 0.27 హెక్టార్ల పత్తి, ఏడుగురు రైతుల 2.24 హెక్టార్లలో కంది, 69 మంది రైతుల 14.06 హెక్టార్ల భూముల్లో ఇసుక మేటలు వేసిందని అధికారులు ప్రభుత్వానికి నివేదికలు పంపించారు.

● కేంద్రం పరిహారం అందించకపోవడానికి కారణం అదేనా?

కేంద్ర ప్రభుత్వ బృందం పర్యటించిన ప్రతి చోట పరిహారం రావడం తప్పనిసరి. కానీ ఇక్కడ మాత్రం రాకపోవడానికి అనేక కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. మానాల శివారులో కెనాల్ తెగకముందే రెండేళ్ల క్రితం గండి పడి సిమెంట్ సంచులతో తాత్కలిక మరమ్మతులు చేశారని కేంద్రబృందం దృష్టికి వెళ్లిన్నట్లు తెలిసింది. దీంతో ఇది మానవ తప్పిదంగా పరిగణించే కేంద్రం పరిహారం ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. ప్రకృతి విపత్తులకు అందించే పరిహారం అప్పటి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంగా తెగిన కాలువకు అందించలేమని చెప్పిన్నట్లు పలువురు పేర్కొంటున్నారు.

పంటలు మొత్తం నీట మునిగాయి



కెనాల్ కాలువ తెగడంతో తమ భూముల నుంచి నీరు ప్రవహించి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. తమ మామిడి తోటతో పాటు అయిదు ఎకరాల కంది పంటలు నీటిలో మునిగి పోయాయి. అధికారులు వచ్చి పలుమార్లు సర్వే చేశారు. నివేదికలు తయారు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసు కెళ్లినా దీనిపై పట్టించుకునే వారే లేరు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం పరి హారం అందించాలి.

- రాజేందర్, రైతు, మ్యాదంపల్లి

సాగుకు రెండేళ్లు పట్టింది



తనకున్న భూమితో పాటు మరో ఎకరం కౌలుకు తీసుకొని వరి పంట సాగు చేసాను. కాలువకు గండి పడి నీరంతా తమ పొలం నుంచే వెళ్లింది. ఇసుక మేటలు వేసింది. గండ్లు పడి వ్యవసాయం చేసుకునే విధంగా లేకుండా పోయింది. దీంతో రెండేళ్లు చదును చేయడానికే పట్టింది. అప్పుడు పంట నీటిలో కొట్టుకు పోయి నష్టం జరుగగా చదును చేయడం, రెండేళ్ల పాటు పంట వేయక పోవడంతో మరింత అప్పులు చేయాల్సి వచ్చింది.

- రాజయ్య, రైతు, మానాల

దుబాయిలో గంభీరావుపేట వాసి మృతి

- వెళ్లిన కొద్ది రోజులకే విషాదం ● కన్నీరు మున్నీరవుతున్న భార్యాపిల్లలు ● మృతదేహాన్ని త్వరగా తెప్పించాలని వేడుకోలు

గంభీరావుపేట, సెప్టెంబరు 19: బతుకుదెరువు కోసం గల్ఫ్ బాట పట్టిన ఓ వ్యక్తి వెళ్లిన కొద్ది రోజులకే ఫిట్స్‌తో మృతి చెందిన ఘటన ఆ కుటుంబాన్ని కలిచివేస్తోంది. గంభీరావుపేటకు చెందిన కరువారి దేవయ్య (46) అనే వ్యక్తి గత నెల 19న లక్షా రూపాయల వరకు అప్పుచేసి ఓ కంపెనీ వీసాపై దుబాయి వెళ్లాడు. వెళ్లిన రెండు రోజుల్లో దేవయ్య పనిలో చేరాడు. పనిలో చేరిన మరుసటి రోజే దేవయ్య తన రూంలో ఉండగా ఫిట్స్ వచ్చింది. దీంతో దేవయ్యను ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ గత నెల 27న మృతి చెందాడు. గల్ఫ్‌లో దేవయ్య మృతి చెంది దాదాపు 22 రోజులు గడిచి పోయాయి. దేవయ్య ఫిట్స్‌తో ఆసుపత్రిలో చేరి, చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం కుటుంబీకులకు ఆలస్యంగా తెలిసింది. దేవయ్య నుంచి ఫోన్ రాకపోవడం, ఇక్కడి నుంచి ఫోన్ కలవకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. దుబాయిలో తెలిసిన వారి నుంచి దేవయ్య మృతి చెందాడని ఫోన్ రావడంతో భార్యాపిల్లలు రోదనలు మిన్నంటాయి. మృతి చెంది 22 రోజులు గడిచినా ఇంటికి దేవయ్య మృతదేహం రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. దేవయ్య మృతదేహాన్ని అక్కడి



దేవయ్య(ఫైల్)



దేవయ్య మృతదేహాన్ని తెప్పించాలని వేడుకుంటున్న దేవయ్య భార్యాపిల్లలు

ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచారాని సమాచారం అందింది. కంపెనీ యాజమాన్యం పట్టించుకోకపోవడంతో దేవయ్య మృతదేహం స్వదేశానికి రావడం ఆలస్యం అవుతోందని మృతుడి బంధువులు తెలిపారు. దుబాయిలో కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి తన భర్త దేవయ్య మృతదేహన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించేలా ప్రభుత్వం కృషి చేయాలని భార్య శ్యామల వేడుకుంటున్నారు.

ప్రపంచ దేశాల్లో శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నది భారతీయులే

- తహసీల్దార్ కిషన్

కోరుట్ల, సెప్టెంబరు 19 : ప్రపంచ దేశాలలో భారతీయులు శాస్త్రవేత్తలుగా రాణిస్తున్నారని తహసీల్దార్ కిషన్ అన్నారు. పట్టణంలోని శిశు మందిర్‌లో సిద్దిపేట, జగిత్యాల, కరీంనగర్, రాజ న్న సిరిసిల్ల విభాగ్‌స్థాయి గణిత విజ్ఞాన మేళాను ఆర్ఎస్ఎస్ గ్రామీణ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జిన్నా సత్యనారాయణతో కలిసి తహసీల్దార్ కిషన్ ప్రారంభించారు. గణత విజ్ఞాన మేళా కార్యక్రమానికి విచ్చేసిన విద్యార్థుల పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించిన సరస్వతి శిశుమందిర్‌ల నిర్వాహకులు గణతంలో వివిధ మెలకువలపై విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా తహ సీల్దార్ కిషన్, ఆర్ఎస్ఎస్ గ్రామీణ వికాస్ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జిన్న సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులు గణితంలో శ్రద్ధ వహించి చదువుతే ఉన్నత ఫలితాలు సాధించ



సమావేశానికి హాజరైన వక్తలు

వచ్చునని తెలిపారు. విద్యార్థులకు శిశుమందిర్ విద్యా ఎంతో క్రమశిక్షణను నేర్పుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి గంగుల నరేశం, డాక్టర్ రవికిరణ్, పాఠశాల కరస్పా డెంట్ నీలి శ్రీనివాస్, డైరెక్టర్లు మనోజు కుమార్, శివప్రసాద్, చంద్రమోహన్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో రైతు మృతి

మల్లాపూర్, సెప్టెంబరు, 19 : మండలంలోని కుస్తాపూర్ శివారులో మక్క తోట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెతో జెల్ల పెద్ద ముత్తన్న(60)అనే రైతు విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గొండ సాయన్న అనే రైతు తన మక్కచేను రక్షణ విద్యుత్‌తో కంచె ఏర్పాటు చేసుకోవడంతోనే పెద్ద ముత్తన్న మృతి చెందినట్లు అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గొండ సాయన్నపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. జెల్ల పెద్దముత్తన్న ఎరువులు చల్లేందుకు తన పొలం వెళ్లాడు. రాత్రి అయినప్పటికీ తిరిగి ఇంటికి రాకపోగా కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. కాగా గొండ సాయన్న తన మక్క చేను రక్షణకు అమర్చుకున్న ఇనుప కంచె వద్ద పెద్దముత్తన్న విగత జీవిగా పడి ఉన్నట్లు కుటుంబ సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. విద్యుదాఘాతంతో శరీరం కమిలిపోయి ఉన్నట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవపంచనామా జరిపి పోస్టుమార్టంకు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భూ వివాదాలతో వ్యక్తి దారుణ హత్య

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 19 : భూ వివాదాల విషయమై ఓ వ్యక్తి హత్యకు గురైన సంఘటన పెద్దపల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైల్వే రిటైర్డ్ కార్మికుడు కలవేన రాజయ్య(68)కు, అతడి బంధువులకు మధ్య కొంతకాలంగా భూముల విషయంలో తగాదాలు జరుగుతున్నాయి. గురువారం రోజూమాదిరిగా రాజేశం ఇంటి నుంచి పొలం వద్దకు వెళుతుండగా కొత్తపల్లి-కొలనూర్ గ్రామ శివారులో కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు దాడిచేసి హతమార్చారు. సంఘటన స్థలాన్ని పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్ పరిశీలించి స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతుడి కుమారుడు మాజీ ఎంపీటీసీ సాయి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు.

ఒకరి గల్లంతు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 19 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో గురువారం ఒకరు గల్లంతయ్యారు. సుమారు 24 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి చెరువులోకి ఈత కోసం వెళ్లి బయటకు రాకపోవడాన్ని స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి పట్టణ పోలీసులు చేరుకుని జాలర్లతో గాలింపు చేపట్టారు. రాత్రి కావడంతో ఆచూకీ లభ్యం కాలేదని పోలీసులు తెలిపారు.

రేషన్‌బియ్యం పట్టివేత

మంథనిరూరల్, సెప్టెంబరు 19: మండలంలోని నాగారం గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియాన్ని పట్టుకున్నామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేందర్ గురువారం తెలిపారు. బుధవారం అర్ధరాత్రి సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు చేయగా మినీ డీసీఎం వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న 48.8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించి, వ్యాన్‌ను పోలీస్‌స్టేషన్ అప్పగించినట్లు తెలిపారు. వ్యాన్‌యాజమాని, డ్రైవర్, ఇతర కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పట్టుకున్న విలువ 2.78 లక్షల విలువ ఉంటుందన్నారు.

సైదాపూర్, సెప్టెంబరు 19: సైదాపూర్ మండలంలోని ఎలబోతారం గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచిన ఐదు క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. సమాచారం ప్రకారం ఎలబోతారంలో తనిఖీ చేయగా ఓ ఇంటిలో అక్రమంగా నిలువ ఉంచిన ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. బియ్యం నిలువ ఉంచిన బత్తు భిక్షపతి, బత్తుల రాజయ్య స్వామిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బాలుడికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19 : మండల కేంద్రానికి చెందిన వైభవ్ అనే బాలుడు కుక్కల దాడిలో గురువారం తీవ్ర గాయాలపాలయ్యాడు. బాలుడిని తల్లిదండ్రులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వైభవ్ ఇంటి ఎదుట ఆడుకుంటున్న క్రమంలో కుక్కలు దాడి చేశాయి. అక్కడే ఉన్న బాలుడి తల్లిదండ్రులు కుక్కలను తరమడంతో అవి అక్కడ నుంచి పారిపోయాయి. గ్రామంలో ఇటీవల కుక్కల బెడద అధికమైందని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి..

చందుర్తి. సెప్టెంబర్ 19 : చందుర్తి మండలం మర్రిగడ్డ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చందుర్తి మండల కేంద్రానికి చెందిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. చందుర్తికి చెందిన చేట్టిపెల్లి రవి అనే యువకుడు గురువారం తన ద్విచక్ర వాహనంపై వేములవాడ నుంచి చందుర్తికి వస్తున్నాడు. కోరుట్ల నుంచి వేములవాడకు వెళ్తున్న డీసీఎం వ్యాన్ ఎదురెదురుగా మర్రిగడ్డలో ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రవి ఎడమ కాలుకు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో వేములవాడ ఆసుపత్రికి తతరలించారు. ఈ సంఘటనపై విచారణ చేపట్టినట్లు ఏఎస్సై బాపు తెలిపారు.

ముగ్గురిపై అదనపు వరకట్నం కేసు

జమ్మికుంట, సెప్టెంబరు 19 : అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు. జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్ గ్రామానికి చెందిన ఎండి సమీనాకు, అదే గ్రామానికి చెందిన సమీర్‌కు పది నెలల క్రితం వివాహం జరిగింది. నెల రోజుల పాటు వారి కాపురం సజావుగా సాగింది. అనంతరం అదనపు కట్నం కావాలంటూ భర్త వేధిస్తున్నాడు. దీంతో తల్లిగారి ఇంటికి వచ్చిన సమీనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన భర్త సమీర్, మామ గఫార్, అత్త కమర్‌లు అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్లు అప్పగింత

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19 : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా పోగొట్టుకున్న 25మంది బాధితుల మొబైల్ ఫోన్లను కరీంనగర్ సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ పోలీసులు సీఈఐఆర్ విధానం ద్వారా పట్టుకుని గురువారం బాధితులకు సీఐ రమేష్ చేతుల మీదుగా అప్పగించారు. 1,035మంది మొబైల్ ఫోన్‌లను గుర్తించి బాధ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్ సీఐ రమేష్, ఎస్ఐ నాగరాజు పాల్గొన్నారు.

ముచ్చటిస్తూ.. సమస్యలను తెలుసుకుంటూ..

- ఏకలవ్య గురుకుల పాఠశాలను సందర్శించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 19 : మండలంలోని దుమాల ఏకలవ్య గురుకుల పాఠశాలను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటిస్తూ సమస్యలను తెలుసుకున్నారు. దుమాలలో దాదాపు మూడు గంటలపాటు పర్యటించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, విద్యార్థుల సంఖ్య, బోధన విధానం తదితర అంశాలపై ఆరా తీశారు. తరగతి గదుల్లోకి నేరుగా వెళ్లి పిల్లలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను గుర్తించారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన చిత్రలేఖనం గదిని ప్రారంభించారు. విద్యార్థులు గీసిన చిత్రాలను తిలకించారు. సాధించిన అవార్డులను విద్యార్థులు, ఉపాధ్యాయులు వివరించారు. సంగీతం గదికి వెళ్లారు. విద్యార్థులు కింద కూర్చోని ఉండడంతో ఆయన వారితో పాటే కింద కూర్చోని సంగీతం విన్నారు. ఇటీవల రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినిని ఉపాధ్యాయులు పరిచయం చేయడంతో మంత్రి సంజయ్‌కుమార్ మొదటి పల్లవి పాడాలని కోరారు. దాంతో విద్యార్థిని 'పలుకె బంగారమాయేనా.. కోదండ పాణి' అంటూ పాడడంతో మంత్రి సంజయ్‌కుమార్ లీనమయ్యారు. విద్యార్థినిని అభినందించి మనమంతా ఇలాంటి పాటలే పాడాలని సూచించారు. అనంతరం మంత్రి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏకలవ్య ఆదర్శ పాఠశాలలను ఏర్పాటు చేసిందని తెలిపారు. గిరిజన, ఆదివాసీ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆశించిన ఫలితాలు క్షేత్రస్థాయిలో అమలు అవుతున్నాయో..? లేదో పరిశీలించాలనే పీఎం నరేంద్రమోదీ ఆదేశాల మేరకు కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని మరిమడ్ల, దుమాలలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాలలను సందర్శించామని వెల్లడించారు. అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల ద్వారా సమస్యలను గుర్తించామని పేర్కొన్నారు. నివేదికను ప్రభుత్వానికి సమర్పించి మెరుగైన విద్య అందించేందుకు పాటు పడుతామని అన్నారు.

● పిల్లలూ పెద్దయ్యాక ఏమవుతారు..?

దుమాల ఏకలవ్య ఆదర్శ పాఠశాల తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో బండి సంజయ్ మాట్లాడారు. ఏం తల్లీ నీ పేరే



దుమాలలో కేంద్ర మంత్రి సంజయ్‌కుమార్‌కు చిత్ర పటాన్ని అందజేస్తున్న విద్యార్థినులు

మీటి..? అంటూ ప్రశ్నించారు. బాగున్నారా..? నేనెవరినో గుర్తు పట్టారా..? ఎలా చదువుతున్నారని కుశల ప్రశ్నలు వేశారు. సార్ మేం బాగున్నాం.. మీరేలా ఉన్నారూ.. అని పేర్కొన్నారు. సారూ.. మీరు కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ కదా..! అని చెప్పడంతో గుర్తున్నానులే అంటూ సమాధానమిచ్చారు. పిల్లలు పెద్దయ్యాక మీరేం అవుతారని ప్రశ్నించడంతో ఓ విద్యార్థిని ఐపీఎస్, మరో విద్యార్థిని ఐఏఎస్ అని పేర్కొనడంతో మంత్రి సంజయ్‌కుమార్ శభాష్ అంటూ అభినందించారు. ఆ దిశగా మీరు ఉన్నత స్థాయికి చేరుకోవడానికి పీఎం నరేంద్రమోదీ ప్రభుత్వం అధిక నిధులు కేటాయించి ఆధునిక విద్యను అందిస్తోందని మంత్రి బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో రమేశ్, ఏకలవ్య పాఠశాలల ఆర్‌సీవో జానునాయక్, డీఈవో రమేశ్ కుమార్, ప్రత్యేక అధికారులు భారతి, రాందాస్, ప్రిన్సిపాల్ మంజిద్ తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట: మండలంలోని మరిమడ్ల గ్రామంలో గల ఏకలవ్య గురుకుల పాఠశాలను బండి సంజయ్ సందర్శించారు. ఈ సందర్భంగారాగా అధికారులు, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రికి విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలికారు. అనంతరం గురుకుల పాఠశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మనోభావాలు ఎలా ఉన్నాయి? ఎవరు స్పోర్ట్స్‌పై దృష్టిపెట్టారు. చదువులో ఎలా దృష్టి పెట్టారు అనే అంశంపై ఒక్కొక్క విద్యార్థిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థులను పాఠశాలల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా టాయిలెట్ల నిర్మాణం కోసం మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, డీఈవో రమేష్, ప్రత్యేక అధికారులు లక్ష్మీరాజం, భారతి, రాందాస్, ఆర్డీవోలు రాజేశ్వర్, రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, ప్రిన్సిపాల్ ఆర్ఎస్‌యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, బీజేపీ నేత చెన్నమనేని వికాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

'రెజ్లింగ్ కోచ్‌ను నియమించండి'

కరీంనగర్‌స్పోర్ట్స్, సెప్టెంబరు 19: కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాలలో రెజ్లింగ్ కోచ్‌ను నియమించాలని తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని తెలంగాణ అమెచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహ్మద్ కరీం కోరారు. గురువారం హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో జరిగిన రాష్ట్ర క్రీడాసంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల సమా వేశంలో కరీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్ స్కూల్లో రెజ్లింగ్ క్రీడకు సంబంధించి అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సౌకర్యాలు ఉన్నట్లు తెలిపారు. కోచ్ లేకపోవడం వలన ఈ పరికరాలు నిరుపయోగంగా మారాయని తెలిపారు ఈ పాఠశాల నుండి ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్ర జాతీయస్థాయిలో పతకాలు సాధించిన ఘనత ఉందని తిరిగి పూర్వవైభం తీసుకొచ్చేందుకు కోచ్‌ను నియమించాలని ఆయన కోరారు. స్పందించిన చైర్మన్ రెండు, మూడు రోజుల్లో స్పోర్ట్స్‌స్కూల్ సందర్శిస్తానన్నారు. రెజ్లింగ్ కోచ్‌ను తప్పనిసరిగా నియమించేలా స్పోర్ట్స్ అథారిటీ అధికారులను సత్వరమే ఆదేశించనున్నట్లు ఆయన తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



శ్రమదానం చేస్తున్న వివేకానంద కళాశాల విద్యార్థులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు19: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిఎచ్.శ్రీనివాస్ సూచించారు. వివేకానంద డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 1అండ్ 2 ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ-2024లో భాగంగా గురువారం కళాశాల ఆవరణలో శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సిఎచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా లేనిఎడల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు ధనపురి సాగర్, బైరం మహేష్, ఏసిటిబి సంపత్ కుమార్, ఏవో బి శ్రవణ్ కుమార్, రామేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ వలంటీర్స్ పాల్గొన్నారు.

సిరిపురం ఈశ్వర్‌కు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న ఈశ్వర్

భగత్‌నగర్/గణేష్‌నగర్, సెప్టెంబరు 19: నగరానికి చెందిన సిరిపురం ఈశ్వర్‌కు గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. 28సంవత్సరాల నుంచి విద్యా రంగంలో విశిష్ట సేవలు అందించి ఎందరో విద్యార్థులను విద్యావంతులుగా తీర్చిదిద్దిన సిరిపురం ఈశ్వర్ సేవలను గుర్తించి గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ చెన్నై వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. 2010నుంచి 2022 వరకు వికాస్ డిగ్రీ, పీజీ కాలేజ్ వ్యవస్థాపకులుగా వికాస్ ట్యుటోరియల్ వ్యవస్థాపకులుగా విడాన్, శాతవాహన యూనివర్సిటీ సెనేట్ మిటీ సభ్యులుగా కొనసాగారు. ప్రస్తుతం సాహితి జూనియర్ కళాశాల డైరెక్టర్, హలో కిడ్స్ విద్యాసంస్థల చైర్మన్ బూరిబ్బన్ విదేశీ విద్యాసంస్థ ఆఫ్ కన్సల్టింగ్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లా డుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

టాస్క్ ఆధ్వర్యంలో నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 19: తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో నగరంలోని వివేకానంద డిగ్రీ,పీజీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు నైపుణ్యాల అభివృద్ధిపై మూడు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు వివిధ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడు మాత్రమే ఉపాధి అవకాశాలను అందుకో వచ్చని అన్నారు. సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ ఆంటోనీ డిసౌజ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, అనలిటికల్ లీడర్‌షిప్ స్కిల్స్ పెంచుకునేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టి.పి.ఓ డాక్టర్. మహమ్మద్ అబ్దుల్ సలీం, ఏ.సి.ఓ. బి. సంపత్ కుమార్, ఏ.వో బి.శ్రవణ్ కుమార్ అధ్యాపక బృందం, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి

జమ్మికుంట, సెప్టెంబరు 19: సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయా లని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, జిల్లా కార్యదర్శి నరసింహారాజు, నియోజకవర్గ కన్వీనర్ మాడ గౌతమ్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుప్పాల రఘు, పట్టణ అధ్యక్షులు జీడి మల్లేష్, నాయకులు సలెంద్ర, శివన్న, పల్లపు రవి, రాగూర్ రాజేష్, కైలాసకోటి గణేశ్ పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్య క్రమాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి పరి శీలించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి సంపత్‌రావు, నర్సింహారాజు, మాడ గౌత మ్‌రెడ్డి, పుప్పాల రఘు, గంగిశెట్టి రాజు, శివన్న, శశిధర్, శ్రీనివాస్, వేణు, రాజు, సంజీవరెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వీణవంక: మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్ర మాన్ని సుహాసిని రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రామిడి ఆదిరెడ్డి, నాయకులు పుప్పాల రఘు, చెన్నమాధవుని నర్సింహరాజు, పెద్ది మాల్లారెడ్డి, సదా నందం, భాస్కర్, పత్తి దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సమ్మిరెడ్డి నాని, మాధవి, రమణారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ అన్నారు. మండలంలోని పెద్దకుర్మపల్లిలో గురువారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమన్ని ఆమె ప్రారంభిం చారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మావు రం సుదర్శన్‌రెడ్డి, గ్రామ అధ్యక్షుడు పులి కనుకయ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పుల్లెల పవన్ కుమార్ , మాజీ ఎంపీ పీ వాసాల రమేశ్, ప్రోగ్రాం ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రవణ్ , నాయకులు మొగిలి సారయ్య, గోల్ల గట్టయ్య , తోట్ల గంగ మల్లయ్య, ఏలేటి తిరుపతిరెడ్డి, గన్ను నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ప్రజాపాలనే ప్రభుత్వ ధ్యేయం



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

గన్నేరువరం, సెప్టెంబరు 19: నిరుపేదలకు ప్రయోజనం చేకూర్చేలా కాం గ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనను కొనసాగిస్తోందని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనా రాయణ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం లబ్ధిదా రులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. మండలంలోని పారువెల్ల, ఖైలారం ఖాసింపేట, గునుకుల కొండాపూర్, చీమల కుంటపల్లి, గన్నేరువరం గ్రామాలకు చెందిన 11మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 19మంది లబ్ధిదా రులకు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దా రు ఇప్ప నరేందర్, ఏవో కిరణ్మయి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి, జిల్లా నాయ కులు చిట్కూరి అనంతరెడ్డి, బొడ్డు సునీల్, గ్రామశాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్‌రెడ్డి, మాతంగి అనిల్, నల్ల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'చెరువు శిఖం భూములు కబ్జా చేస్తే చర్యలు'

-ఇరిగేషన్ శాఖ ఈఈ నాగభూషణ్

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు19: చెరువు శిఖం భూములను కబ్జా చేస్తే శాఖాపరంగా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ శాఖ ఈఈ నాగభూషణ్ హెచ్చరించారు. గురువారం కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లిలోని ఊర చెరువు (సర్వే నెంబర్ 215)లో శిఖం భూముల ఆక్రమణలపై ఇరిగేషన్ అధికారులు చెరువు వద్దకు వెళ్లి పరిశీలించారు. ఇటీవల ఊర చెరువు శిఖంలో మట్టి పోసి చెరువు శిఖం భూమిని కొందరు వ్యక్తులు కబ్జాకు యత్నిస్తు న్నారని కాలనీవాసులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.



ఊర చెరువు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ శాఖ ఈఈ నాగభూషన్‌రావు, డీఈ సంతోష్, ఏఈఈ నవీన్‌లు చెరువును పరిశీలించారు. చెరువు ప్రాంతంలో మట్టి పోసిన ప్రాంతాన్ని గుర్తించారు.

ఈ సందర్భంగా మట్టి పోసి చదును చేస్తున్న వారు వెంటనే తొలగించాలని, ప్రస్తుతం వారికి నోటీసులు జారీ చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారం రోజుల్లో మట్టిని తొలగించకపోయినా, ఆక్రమణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎస్సారార్‌లో అవగాహన సదస్సు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 19: కరీంనగర్‌లో ఈనెల 22న నిర్వహించబోయే హాఫ్ మారథాన్ గురించి ఎస్సారార్ కళాశాలలో గురువారం సంస్థ నిర్వాహకులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ హాఫ్ మారథాన్ జరిగే సమయంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు చేయవలసిన పనులను వివరిస్తూ హాఫ్ మార థాన్‌లో పాల్గొనేటువంటి అభ్యర్థులకు కావలసినటువంటి సహాయ సహకారాలు అందించవలసిందిగా కోరారు. కార్యక్ర మంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ మల్లారం శ్రీనివాస్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ కె అర్జున్, రాజేశం, ఎలిజబెత్ రాణి, పడాల తిరుపతి, రాపర్తి శ్రీనివాస్ వలంటీర్లు పాల్గొన్నారు.

డిజిటల్ పంట సర్వేపై అవగాహన

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 19: పంట సాగు డిజిటల్ సర్వే పై కరీంనగర్ మండలంలోని చామనపల్లి గ్రామంలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్ కమీషనర్ కార్యాలయం నుంచి అగ్రికల్చరల్ కమీషనర్ గోపి, అగ్రికల్చరల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్‌రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డిజిటల్ సర్వేపై అవగాహన మండల వ్యవసాయ శాఖ అధికారులకు అవగాహన కల్పించారు. క్రాప్ బుకింగ్ యాప్‌లో కాడాస్ట్రల్ మ్యాప్ ద్వారా ఈ సర్వే చేయాలని సూచించారు. ఈ మ్యాప్ లేకుండా ఉన్న పంటల సర్వేను, క్షేత్రస్థాయిలో వెళ్ళి డిజిటల్ సర్వే ఆన్‌లైన్‌లో పంట డిజిటల్ సర్వే చేయాలని ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ అధికారు లకు సూచించారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం, ఎఈఓలు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

'అల్ఫోర్స్' నరేందర్‌రెడ్డికి రెడ్డి జేఏసీ మద్దతు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: ఎమ్మెల్సీగా పోటీలో ఉంటానని ప్రకటించిన అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్‌రెడ్డికి తెలంగాణ రాష్ట్ర రెడ్డి జేఏసీ మద్దతు తెలిపింది. గురువారం నరేందర్‌రెడ్డిని తెలంగాణ రాష్ట్ర రెడ్డి జేఏసీ ప్రతినిధులు రాంరెడ్డి, పి రాంరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, చుక్కారెడ్డి, తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని విద్యారంగం దేశ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. విద్యార్థులకు తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యనందిస్తు అగ్రగామిగా కొనసాగు తుండడం హర్షించదగిన విషయమన్నారు. గొప్ప విద్యావేత్త, సౌమ్యశీలి నరేందర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిం చాలన్నారు. ఈసందర్భంగా అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రుల సమస్యలు తెలిసిన వాడిగా తనని ఎమ్మెల్సీగా గెలిపించాలని వారిని కోరారు.

సెయింట్ జార్జ్ విద్యార్థులకు దంత పరీక్షలు

భగత్‌నగర్, సెప్టెంబరు 19: నగరంలోని సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ విద్యార్థులకు ఎడ్యుకేషన్ టూర్‌లో భాగంగా లక్షయ దంత వైద్యశాలను సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రియదర్శిని దంత వైద్యులు విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించి పలు సూచనలు చేశారు. నోటి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలని విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులను పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి అభినందించారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి సంగీత పాల్గొన్నారు.

మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 19: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గురువారం మంచిర్యాల చౌరస్తాలో మహమ్మదీ మస్జీద్ వద్ద హీర ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ ముఫ్తి మహ్మద్ ఘియాస్ మొహియొద్దీన్ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర పుస్తకాల పంపిణీ చేశారు. ప్రవక్త జీవితం గురించి ఆయన ప్రసంగించారు. ప్రముఖులతో పాటు నగరవాసులు, బాట సారులు, వాహనదారులు ప్రవక్త జీవిత చరిత్రకు చెందిన పుస్తకాల స్టాల్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర ఏసీపీ గోపతి నరేందర్, సీఐ శ్రీధర్, కాంగ్రెస్ నాయకులు సమద్‌నవాబ్, శ్రీనివాసరెడ్డి, ఫహీన్నా అమీర్‌తో పాటు షేక్ అహ్మద్ హిఫ్జి, ఫరీద్ హిఫ్జి, నుసరతుల్ల, ముఖరం, కలీం షరీఫ్, తౌహిద్, రఫి పాల్గొన్నారు.



సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డికి పుస్తకాన్ని అందజేస్తున్న ముస్లింలు

ముసాయిదా ఓటరు జాబితాపై సమావేశం

కరీంనగర్ రూరల్, సెప్టెంబరు 18: కరీంనగర్ మండల పరిషత్‌లో గురువారం ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో అధికారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితాలో నుంచి తొలగించలేదన్నారు. దీంతో రిజర్వేషన్ల ఖరారుపై ప్రభావం పడుతుందని తెలిపారు. ఒకే కుటుంబంలో ఓట్లు ఒకే వార్డులో రావడం లేదని తెలిపారు. అదనపు జాబితాలో లేక పోవడంతో ఓత్త ఓటర్లకు పంచాయతీ ఎన్నికల్లో ఓటేసే అవకాశం లేకుండా పోతుందని వివరించారు. ఈసందర్భంగా ఎంపీడీవో సంజీవరావు ఈనెల 21వ తేది వరకు ఓటర్ల జాబితాపై ఫిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు. 26న ఫిర్యాదులను పరిష్కరించి 28వ తేదిన తుది జాబితాను ప్రకటిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈసమావేశంలో యంపీఓ జగన్మోహన్ రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు పెండ్యాల శ్యాంసుందర్ రెడ్డి, కె రాంరెడ్డి, ఎం సంతోష్ కుమార్, కాంరెడ్డి రాంరెడ్డి, మాడిశెట్టి సంతోష్ కుమార్, ఆగయ్యతో పాటు పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: తడి, పొడి చెత్తను వేరు చేసి నగర పాలక సిబ్బందికి అందజేయాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. నగరంలోని సప్తగిరి కాలనీ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తడి చెత్తతో కాంపోస్టు తయారు చేయా లన్నారు. ఈ సందర్భంగా సప్తగిరి కాలనీ స్కూల్ నందు మొక్కను నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19: కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఆదివాసీ మహిళపై ముగ్దుం అనే ఆటో డ్రైవర్ లైంగికదాడిని నిరసిస్తు శనివారం తుడుందెబ్బ పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల రవీందర్ పిలుపునిచ్చారు. ఫాస్ట్‌ట్రాక్ ద్వారా విచారణ జరిపి నిందితుడిని ఉరి తీయాలన్నారు. ఏజెన్సీలో 1/70 పీసా చట్టాల అమలుకు తుడుందెబ్బ పోరాడుతుందన్నారు. ఈ బంద్‌కు వాణిజ్య, వ్యాపార, విద్యా సంస్థలు సహకరించలని విజ్ఞప్తి చేశారు.

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలియజేయాలి

చిగురుమామిడి, సెప్టెంబరు 19: మండలంలో ఓటరు జాబితాలో అభ్యంత రాలు ఉంటే తెలియజేయాలని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని ఆయా రాజకీయ పార్టీల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ఎండీ ఖాజామొయినోద్దీన్ అధ్యక్షతన నిర్వహిచిన సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్ఐలు అరుణ్, సంతోష్ పాల్గొన్నారు.

గంగాధర: ఓటరు జాబితాలో పేరు లేకుంటే బీఎల్‌వోలను సంప్రదిం చాలని ఎంపీడీవో జనార్దన్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు జాబితాలో పేరు తప్పి పోయి ఉంటే బీఎల్‌వోలను సంప్రదించాలని సూచించారు. కార్యక్ర మంలో బీఎల్‌వోలు, కార్యదర్శులు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చొప్పదండి: గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా గురువారం ఓటరు జాబితా తయారీపై మండల పరిషత్ కార్యాల యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఓటరు జాబితాలో మార్పులపై వివిధ పార్టీల నాయకులు, మండల అధి కారులు, పోలింగ్ బూత్ స్థాయి అధికారులతో సమావేశాన్ని నిర్వహించి సూచనలు స్వీకరించారు. కార్యక్ర మంలో తహసీల్దార్ పి నవీన్‌కుమార్, ఎంపీడీవో ఆర్ వేణుగోపాల్‌రావు, నాయబ్ తహసీ ల్దార్ వి శ్రీనివాస్, శ్రవణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై సమావే శం నిర్వహించారు. మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ గ్రామపంచాయతీలో ఓటరు జాబితాలో తప్పులు చోటు చేసుకున్నాయని, సరిచేయాలని మాజీ సర్పంచ్ కొడిగూటి శారద ఎంపీడీవో సరితకు వినతి పత్రం అందజేశారు.

శంకరపట్నం: మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో ఓటర్ జాబితాలో మార్పులు, చేర్పులపై రాజకీయ పార్టీ నాయకులు, బూత్ లెవల్ అధికారులతో ఎంపీడీవో కృష్ణప్రసాద్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీవో ప్రభాకర్, సూపరింటెండెంట్ రాఘవేంద్రరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరోత్తంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు ఆరిఫ్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట: నూతనంగా వచ్చిన ఓటర్ జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియ జేయాలని ఎంపీడీవో పుల్లయ్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీవో రాజేశ్వర్‌రావు, బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్

సైదాపూర్: ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21లోగా తెలు పాలని రాజకీయ పార్టీలకు తహసీల్దార్ దూలం మంజుల సూచించారు. మం డల పరిషత్ కార్యాలయంలో ఓటర్ జాబితాలో అభ్యంతరాలపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీ డీవో యాదగిరి, ఎంపీవో బషీరొద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండ లాధ్యక్షుడు దొంత సుధాకర్, బీజేపీ మండలాధ్యక్షుడు కందుల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలా ధ్యక్షుడ సోమారపు రాజయ్య, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఓటరు జాబితాపై అభ్యంతరాలపై రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహిం చారు. సమావేశంలో పర్యవేక్షకుడు రాజేష్, మాజీ ఎంపీపీలు జవ్వాజి హరీష్, బొమ్మరవేణి తిరుపతి, గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మోడి రవీందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

తుమ్మేటి కుటుంబ సభ్యులకు పరామర్శ

జమ్మికుంట, సెప్టెంబర్ 19: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మ న్ తుమ్మేటి సమ్మిరెడ్డి కుటుంబ సభ్యులను గురు వారం మాజీ మంత్రి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేం దర్ పరామర్శించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా ఉపా ధ్యక్షుడు ఎరబెల్లి సంపత్‌రావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీరామ్ శ్యామ్, పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్, ఆకుల రాజేందర్, కంకణాల సురేందర్‌రెడ్డి ఉన్నారు.

దాడి కేసులో నలుగురి రిమాండ్

వీణవంక, సెప్టెంబరు 19: మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన మేకల సమ్మయ్య, మేకల శ్రీకాంత్‌పై భూ తగాదాల నేపథ్యంలో దాడి చేసిన ఘటనలో నలుగురిని గురువారం పోలీసులు రిమాండుకు తర లించారు. గ్రామానికి చెందిన మేకల శ్రీనివాస్, నల్లగా స శ్రీనివాస్, నల్లగాస కూమారస్వామి, నల్లగాస సమ్మ య్య మరికొంత మందితో కలిసి గత నెల సమ్మయ్య, శ్రీకాం త్‌పై కట్టెలతో దాడి చేసి కొట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపినట్టు ఎస్సై తోట తిరుపతి తెలిపారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

మానకొండూర్, సెప్టెంబరు 19: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులలో సృజనాత్మకతను పెం పొందించాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు అన్నారు. మండలంలోని వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో మానకొండూర్, శంకరపట్నం మండలాలకు చెందిన తెలుగు భాష ఉపాధ్యాయులకు గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్ శ్రీనివాస్, రెండు మండలాలకు చెందిన తెలుగు భాష ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన విద్యార్థులకు అభినందన

తిమ్మాపూర్, సెప్టెంబరు 19: జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌కి చెందిన నలుగురు టీసీఎస్‌లో, మరో ఇద్దరు విద్యార్థులు యాక్సెంచర్ సంస్థలో ఉద్యోగాలు సాధించడంతో గురువారం విద్యా సంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు అభినందించారు. టీసీఎస్‌లో సిరిగినేని రుచిత రావు, బండ ప్రతిమ, కలికోట శివాని సిస్టం ఇంజనీర్లుగా ఏడు లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారని చెప్పారు. మరో విద్యార్థిని మైదం అనుహ్య టీసీఎస్‌లో అసిస్టెంట్ సిస్టం ఇంజనీర్‌గా 3.36లక్షలు, కన్నం రత్నేష్, సంజన పటేల్‌లు యాక్సెంచర్ సంస్థలో 4.35లక్షల వార్షిక జీతంతో ఉద్యోగాలకు ఎంపికయ్యారని చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ కరస్పాండెంట్ సుమీత్ సాయి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇల్లందకుంట, సెప్టెంబరు 19: సిరిసేడు గ్రామానికి చెందిన బోగం వీరమల్లు అనారోగ్యంతో మృతి చెందగా మాజీ ఎంపీపీ సరిగోమ్ముల పావని-వెంకటేష్ గురువారం బాధిత కుటుంబానికి ఐదు వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మసూద్ అహ్మద్‌ఖాన్, వాసుదేవరెడ్డి, మా జీ ఎంపీటీసీ తెడ్ల ఓదెలు, నాయకులు జువ్వాజి కుమార్, ముస్తఫా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

టౌన్ సీఐ బదిలీ

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 19: కరీంనగర్ వన్ టౌన్ సీఐ జె సరిలాల్ కరీంనగర్ టాస్క్‌ఫోర్స్‌కు బదిలీ అయ్యారు. టాస్క్ ఫోర్స్‌లో పనిచేస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్ వన్‌టౌన్ సీఐగా నియామకం అయ్యారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

నేడు నందిని సిధారెడ్డికి పురస్కారం ప్రదానం

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 19: బుర్ర నరసమ్మ లింగారెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారాన్ని నందిని సిధారెడ్డికి శుక్రవారం ఉదయం 10.30 గంటలకు తెలంగాణచౌక్ వద్ద గల వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో అందజేయనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మధుసూ దన్‌రెడ్డి, బొమ్మకంటి కిషన్, కోశాధికారి అను ముల దయా కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్ పాల్గొంటారని తెలిపారు.

విద్యార్థులకు బ్లూటూత్ అందజేత

సుభాష్‌నగర్, సెప్టెంబరు 19: భరోసా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని అంధుల పాఠశాల విద్యార్థులకు బ్లూటూత్‌ను అందచేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు శివజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు బోర్డు పరీక్షకు సిద్ధమ వడంలో భాగంగా చదవడం ఇబ్బందికరంగా ఉందని తెలియ డంతో వారికి బ్లూటూత్ అందించామని తెలిపారు. అకినెపల్లి విశ్రుత్‌రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో అకినెపల్లి నాగరాజు, అభిరామ్, విశ్రుత్‌రామ్, స్వప్న, సరళ, వర్షిని, భాస్కర్, రమేశ్ పాల్గొన్నారు.

స్పందన యువసేన ఆధ్వర్యంలో టాయ్‌లెట్స్ ఏర్పాటు

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: స్పందన యువసేన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్మించిన శౌచాలయాలను గురువారం ప్రారంభించారు. సంస్థ ఆధ్వర్యంలో మూడున్నర లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన సౌచాలయాలను ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కృష్ణగోపాల్‌తో కలిసి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు మంచికట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ స్ట్రీట్‌లోని బాలికల పాఠశాలలో టాయి లెట్స్ నిరుపయోగంగా ఉన్నాయని తెలుసుకుని స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టాయిలెట్స్ నిర్మాణం చేపట్టి ఉపయోగంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సుధాకర్, పేరెంట్స్ నాజియా, షంషుద్దీన్ మునవర్ పాల్గొన్నారు.

6న సుడా చైర్మన్‌కు సన్మానం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు19: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రెడ్డి ప్రజాప్రతినిధులను, శాసనమండలి సభ్యులను, కార్పొరేషన్ చైర్మన్‌లను అక్టోబరు 6న హైదరా బాద్‌లోని శిల్ప కళా వేదికలో రాష్ట్ర రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డిని రాష్ట్ర ప్రతినిధులు అప్పంగారి రాంరెడ్డి, కొలను వెంకటేశ్వర్‌రెడ్డి, బుట్టెంగారి మాధవరెడ్డి, ఉమ్మడి జిల్లా ప్రతినిధులు కూర మహిపాల్‌రెడ్డి, జున్నుతుల రాజారెడ్డి, వెన్నం రజితరెడ్డి, ఎన్నం కిషన్‌రెడ్డి, బాణపురం రంగారెడ్డి, కదార కళాధర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి గృహానికి వెళ్లి ఆహ్వానించారు.

ఇన్‌స్పైర్ మనాక్‌కు పారమిత విద్యార్థి ఎంపిక

కరీంనగర్ టౌన్, సెప్టెంబరు 19: నగరంలోని పారమిత హెరిటేజ్ పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో జాతీయ పోటీలకు ఎంపికైన శుభశ్రీని పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు అభినందించారు.

కరాటేలో చిన్నారికి రజత పతకం

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 19: జిల్లా కేంద్రంలోని డాక్టర్ అంబేద్కర్ స్టేడియంలో ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన ఆల్ ఇండియా జాతీయ కరాటే పోటీల్లో నాలుగేళ్ల చిన్నారి మహిరాన్షరెడ్డి విశేష ప్రతిభ చాటి రజత పతకం సాధించాడు. గోజుర్యు కరాటే సంస్థలో కరాటే మాస్టర్ సురభి ఇందిర వద్ద శిక్షణ పొందుతున్న విద్యార్థి మహిరాన్షరెడ్డి కటాలో విశేష ప్రతిభ చాటి రజత పతకం సాధించాడని అతని కోచ్ ఎస్ అన్వేష్ తెలిపారు.

● సంక్షిప్త సమాచారం..

● హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి కి చెందిన వంగ వర్షిత్‌పటేల్ ఇటీవల విద్యుదాఘాతం తో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని గురువారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ప్రణవ్ పరామర్శించారు.

- పోతిరెడ్డిపేట గ్రామంలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డును పున్నం సాయికుమార్ తండ్రి ఓదెలు 40,116 రూపాయలకు దక్కించుకున్నాడు.

- మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామం మీదుగా కాం గ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ వె ళ్తుండగా కుల సంఘాల నాయకులు, గ్రామస్థులు కలు సుకొని పలు సమస్యలను విన్నవించుకున్నారు.

● జమ్మికుంట: మారుతినగర్‌కు చెందిన జన్ను కావ్య జాతీయ స్థాయి కరాటే పోటీల్లో బంగారు పథకం సాధిం చడంతో పట్టణ సీఐ వరంగంటి రవి సన్మానించారు.

- ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేశ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతహి సేవ నిర్వహించారు.

● హుజూరాబాద్: పట్టణంలో మున్సిపాలిటీ ఆధ్వ ర్యంలో ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో చెత్తను ఆరు బ యట వేయబోమని విద్యార్థులు, ఉపాధ్యాయులతో స్వచ్ఛ హుజూరాబాద్‌గా తీర్చిదిద్దుటకు ప్రతిజ్ఞ చేశారు.

- రాహుల్‌గాంధీపై బీజేపీ నాయకులు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా హుజూరాబాద్ పోలీస్‌స్టేషన్లో స్థాని క కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు.

- పట్టణానికి చెందిన రమణాచారి అనే వ్యక్తి తల్లి సు శీలమ్మ పెద్దకర్మ సందర్భంగా సైదాపూర్ మండలం ఎల బోతారంలోని దళిత సంఘాల నాయకులకు అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని అందజేశారు.

- పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిరుద్యోగులు, ఉద్యో గులతో విన్నెర్స్ పబ్లికేషన్ అధినేత ప్రసన్న హరికృష్ణ ఆత్మీ య సమ్మేళనం నిర్వహించారు.

● శంకరపట్నం: కాచాపూర్ గ్రామంలోని శ్రీసీతారా మచంద్రస్వామి దేవస్థానం చైర్మన్‌గా నాంపల్లి శ్రీధర్‌ను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● మానకొండూర్, మానకొండూర్ చెరువులో గణేశ్ విగ్రహాల నిమజ్జన వ్యర్థ పదార్థాలను తొలగించాలని మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి శేఖర్‌గౌడ్ గురువారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతి పత్రం అందజేశారు.

- మానకొండూర్‌లో మిలాద్ ఉన్ నబి సందర్భంగా ముస్లిం యువకులు ర్యాలీ నిర్వహించారు.

●తిమ్మాపూర్: దిగువ మానేరు నుంచి కాకతీయ కా లువకు 4వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

● గన్నేరువరం: పంటలు తెగుళ్ల బారిన పడకుండా తీసుకోవల్సిన చర్యలపై జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త వేణుగోపాల్, డివిజన్ ఉద్యానశాఖ అధికారి రవళి రైతులకు అవగాహన కల్పించారు.

● రామడుగు: గోలిరామయ్యపల్లి గ్రామపరిధిలోని నునుకొండపల్లికి చెందిన నునుగొండ ప్రభాకర్ స్మార కార్థం తల్లిదండ్రులు రామవ్వ, లస్మయ్య, కుటుంబ స భ్యులు గురువారం కోటి విలువ చేసే ఎకరం 6 గుంటల భూమిని గ్రామ పంచాయతీకి విరాళంగా అందజేశారు.

- మండల కేంద్రానికి చెందిన భూత్కూరి కాంతను ఆ ల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా మహి ళా ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు జేరి పోతుల మహేందర్ ఉత్తర్వులు జారీ చేశారు.